

Dr.G.Rajesh

CMD INB MEDIA GROUP

TRUTH | TRUST | IMPACT

# INB TIMES

VOICE OF THE PEOPLE

INB TELUGU NEWS

ప్రచురణ: , తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సంపుటి : 03 సంచిక : 117 ఎడిటర్ : జి.రాజేష్ శుక్రవారం 24 జులై 2026 పేజీలు : 6 వెల రూ. 4.00



## ఎర్రచందనం మాఫియా మూలాలను పూర్తిగా తుడిచేయాలి

-అత్యాధునిక సాంకేతికతతో నిఘా పటిష్టం
-జీరో టాలరెన్స్ విధానంతో స్మగ్లింగ్ కి అడ్డకట్ట
-కింగ్ పిన్‌లపైనా ఉక్కుపాదం మోపండి
-మన ఎర్ర చందనాన్ని దేశంలో ఎక్కడ దాచినా వదలవద్దు
-ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

2లో

## నేతన్న సేవతో ఆర్థిక దన్ను

-చేనేతలకు ఏటా రూ.25 వేల ఆర్థిక సాయం
-51,952 మంది నేతన్నలకు ఆర్థిక లబ్ధి
-రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత

వివరాలు 2లో





# ల్యాండ్ లిటిగేషన్ ఫ్రీ రాష్ట్రంగా ఏపీ

● భూ సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి
● భూ రికార్డులకు శాశ్వత భద్రత కల్పించేలా మీ భూమి-బ్లాక్ చెయిన్
● ట్యాంపర్ చేయలేని విధంగా ల్యాండ్ రికార్డులకు హై సెక్యూర్టీ
● మీ భూమి-బ్లాక్ చెయిన్ పైలెట్ ప్రాజెక్టును ప్రారంభించిన ముఖ్యమంత్రి చంద్రబాబు

మిగతా 2లో

అమరావతి, ఐఎన్‌బిటైమ్స్

ప్రక్షాళన-విముక్తి-భద్రత అంశాలుగా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ల్యాండ్ లిటిగేషన్ ఫ్రీ రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దేలా కృషి చేస్తున్నామని సీఎం తెలిపారు. దీనికి అనుగుణంగానే భూ రికార్డులకు శాశ్వత భద్రత కల్పించేలా మీ భూమి-బ్లాక్ చెయిన్ ప్రాజెక్టును తెచ్చామని సీఎం చంద్రబాబు చెప్పారు.

## ఆర్‌డబ్ల్యూఎస్ కాంట్రాక్ట్ కార్మికులకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుంది

-వైయస్ జగన్ భరోసా



తాడేపల్లి, ఐఎన్‌బిటైమ్స్

మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్‌ను గ్రామీణ నీటి సరఫరా (ఆర్‌డబ్ల్యూఎస్) విభాగంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల యూనియన్ ప్రతినిధులు గురువారం కలిశారు.

తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆయనను కలిసి తమ సమస్యలను వివరించారు. గత 26 ఏళ్లుగా రాష్ట్రవ్యాప్తంగా సుమారు 7 వేల మంది కార్మికులు సమగ్ర మంచినీటి పథకాలలో పనిచేస్తున్నారని యూనియన్ ప్రతినిధులు తెలిపారు. గ్రామీణ ప్రాంతాలకు తాగునీరు అందించడంలో కీలకంగా పనిచేస్తున్నప్పటికీ తమకు ఉద్యోగ భద్రత,

మిగతా 2లో

## జూలై 30న ఆరు జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ



● -1న అల్లూరి సీతారామరాజు ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ ప్రారంభోత్సవం
● ఒక రోజు ముందుగానే పెన్షన్ల పంపిణీ
● ఆరు జిల్లాల్లో 11,98,044 మంది లబ్ధిదారులు
● రు. 514.42 కోట్లు పంపిణీ
● మంత్రి కొండపల్లి శ్రీనివాస్

2లో



## అన్ని క్రెడిట్లు ఖాతాలో వేసుకుంటారు కదా

2లో


విద్యార్థులపై లాఠీఛార్జ్ క్రెడిట్ కూడా మీదేనా
ప్రధాని మోడీపై ప్రియాంక సెటైర్లు



# గొడ్డలి పార్టీ కుట్రల పట్ల అప్రమత్తంగా ఉండాలి

మిగతా 2లో

● వివాదాలు సృష్టించడమే గొడ్డలి పార్టీ నైజం
● క్షేత్రస్థాయిలో కూటమి విజయాలను ప్రజలకు తెలపాలి
● ప్రెస్‌మీట్లు పటెట్‌ఇ చేతులు దులుపుకుంటే కుదరదు
● అధికారులతో సమన్వయం చేసుకుంటూ పోవాలి
● కేబినేట్ భేటీలో మంత్రులకు సిఎం చంద్రబాబు క్లాస్



అమరావతి,ఐఎన్‌బిటైమ్స్

గొడ్డలి పార్టీ కుట్రల పట్ల అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర మంత్రులకు ఏపీ సీఎం చంద్రబాబు సూచించారు. క్యాబినెట్ భేటీలో అజెండా అంశాలు ముగిశాక తాజా పరిస్థితులపై ఆయన మాట్లాడారు. మెగా డీఎస్సీని ఢిల్లీ ఆందోళనలతో ముడిపెట్టడానికి వైకాపా ప్రయత్నిస్తోం దని సీఎం దృష్టికి మంత్రులు తీసుకెళ్లారు. వివాదాలు సృష్టించడమే గొడ్డలి పార్టీ నైజమని చంద్రబాబు మండిపడ్డారు. అనంతరం మరికొన్ని అంశాలపై మంత్రులకు సీఎం దిశానిర్దేశం చేశారు. జిల్లాల్లో ఇన్‌ఛార్జ్ మంత్రి, కలెక్టర్ కలిసి పనిచేస్తే మెజారిటీ సమస్యలు పరిష్కారమవుతాయని చంద్రబాబు అన్నారు. మంగళగిరిలో ఇళ్ల పట్టాల పంపిణీకి మంత్రి లోకేశ్ ప్రత్యేక చొరవ తీసుకున్నారని కొనియాడారు.

## ఎల్ నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు


● రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు, సలహాలు పాటించాలి
● సాగు నీటి ఎద్దడిని తట్టుకోవడానికి ప్రత్యామ్నాయ పంటలు వేయాలి.
● నదులు అనుసంధానంతో అద్భుత ఫలితాలు సాధించగలం
● రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖామంత్రి కొలుసు పార్థసారథి



అమరావతిఐఎన్‌బిటైమ్స్

ఎల్ నినో ప్రభావం ఈ ఏడాది అధికంగా ఉంటుంది కావున రైతుల శ్రేయస్సు దృష్ట్యా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మార్గదర్శకత్వంలో మంత్రులు, అధికారులు సమన్వయంతో సమస్య నుండి రైతులు గట్టెక్కే విధానాలపై కసరత్తు చేస్తున్నామని రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి

- మిగతా 2లో



## కాంగ్రెస్‌ది చిత్తశుద్ధి లేని పోరాటం

ప్రధాని నివాసం ముందు ధర్నా ఓ నాటకం
సోనమ్ వాంగ్‌చుక్ భార్య విమర్శలు

# గొడ్డలి పార్టీ కుట్రల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రతి లబ్దిదారుడికి స్వయంగా ఇళ్ల పట్టా ఇచ్చారన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు అన్ని చోట్లా సమన్వయంతో ఈ తరహా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. శాఖాపరంగా ఉన్న సమస్యల పరిష్కారానికి మంత్రులే బాధ్యత తీసుకోవాలని చెప్పారు. కూటమి ప్రభుత్వ రెండేళ్ల విజయాలపై మంత్రులు ప్రెస్‌మీట్‌లు పెట్టి చేతులు దులుపుకొన్నారని సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు. విజయాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లే విషయంలో వెనుకబడ్డారన్నారు. పలాసలో రోడ్డు ప్రమాద ఘటన, తిరుపతిలో ఆంజనేయస్వామి విగ్రహం చోరీ నిందితుల్ని సీసీ టీవీ ఫుటేజ్‌ల ద్వారా పట్టించిన తీరును మంత్రులకు సీఎం వివరించారు. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో ఈసారి క్లిష్ట పరిస్థితులు రావొచ్చని సీఎం అన్నారు. తాగునీటికి తీవ్ర సమస్య ఎదురు కావొచ్చని చెప్పారు. ఈ పరిస్థితుల్లో కృష్ణా, గుంటూరు డెల్టాలో వరిసాగు చేయకుండా రైతులను మంత్రులు చైతన్యపరచాలన్నారు. వర్షాభావ పరిస్థితులపై రైతులకు అర్థమయ్యేలా వివరించేందుకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. గోదావరి-బనకచర్ల అనుసంధానానికి కేంద్రం సహకారం ఉంటుందని వివరించారు. త్వరలోనే మదనపల్లెలో ఉద్యాన హబ్‌ను ప్రారంభిస్తున్నామని చంద్రబాబు ప్రకటించారు. ఆగస్ట్ మొదటి వారంలో ఉత్తరాంధ్రలో భోగాపురం ఎయిర్‌పోర్ట్ ప్రారంభోత్సవం.. చివరి వారంలో రాయలసీమలో ఉద్యాన హబ్ ప్రారంభం ఉంటుందన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టుతో ఉత్తరాంధ్ర ఆశలకు రెక్కలు కల్పించామని.. ఇక ఆ ప్రాంతంలో వెనుకబాటుతనం ఉండరాదన్నారు. రెండో త్రైమాసికంలో అడుగుపెట్టినందున శాఖల వారీగా సమీక్షలు చేసుకోవాలని మంత్రులకు సీఎం సూచించారు. కేంద్రం నుంచి రావాల్సిన నిధులపై దృష్టిసారించాలన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో 3,120 పోస్టుల భర్తీకి సంబంధించి కేబినెట్ ఆమోదం కోసం వచ్చిన ప్రతిపాదనను మరోసారి అధ్యయనం చేయాలని ఆదేశించారు. అవసరమైన ఉద్యోగాలు కోసం మరోసారి అధ్యయనం చేసి ప్రతిపాదనలు పంపాలని కోరారు. మంత్రులు తమ శాఖల పనితీరుపై మరింత దృష్టి సారించాలని సీఎం సూచించారు. చాలా అంశాల్లో మంత్రులు వెనుకబడిపోతున్నారని సీఎం అన్నారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించిన తర్వాత, ఆ అంశంపై ఎమ్మెల్యేలు, మంత్రులు బాధ్యత తీసుకుని ప్రజలకు వివరించాలని ఆదేశించారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, కలెక్టర్ కలిసి పనిచేస్తే అనేక సమస్యలకు పరిష్కారం లభిస్తుందని, ఇద్దరూ కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించాలని సూచించారు. రాష్ట్ర పెట్టుబడి ప్రోత్సాహక మండలిలో ఆమోదం పొందిన



ప్రాజెక్టులను జిల్లా స్థాయిలో సమీక్షించాలని సీఎం ఆదేశించారు. అలాగే ప్లానింగ్ బోర్డు సమావేశాలను తరచూ నిర్వహిస్తూ, అభివృద్ధి పనులపై క్రమం తప్పకుండా సమీక్షలు చేయాలని సూచించారు. 'మీ శాఖల్లో ఉన్న సమస్యలను మీరే పరిష్కరించే విధంగా చొరవ చూపాలి. రెండేళ్ల ప్రభుత్వ విజయాలపై మంత్రులు మీడియా సమావేశాలు నిర్వహించినప్పటికీ, వాటిని ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకెళ్లలేకపోయారు' అని చెప్పుకొచ్చారు. పలాసలో మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు కుమారుడికి సంబంధించిన ఘటన, తిరుపతిలో ఆంజనేయస్వామి విగ్రహం చోరీ కేసుల్లో సీసీటీవీ కెమెరాల ఆధారంగా నిందితులు దొరికిపోయారని ముఖ్యమంత్రి చెప్పారు. డీఎస్సీ పరీక్షల అంశంలో ప్రతిపక్షం చేసిన ఆరోపణలను ప్రజలు నమ్మలేదని, కోర్టులోనూ వారికి అనుకూల ఫలితం రాలేదని వ్యాఖ్యానించారు.

# ఎల్ నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు

నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలో జరిగిన 1390 వ (53వ) క్యాబినెట్ సమావేశంలో పలు అంశాలపై తీసుకున్న నిర్ణయాలను రాష్ట్ర సచివాలయం నాల్గవ భవనం ప్రచార విభాగంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి పార్థసారథి వెల్లడించారు. ఈ ఏడాది ఎల్ నినో ప్రభావం ఆగస్టు తరువాత మరింత తీవ్రంగా ఉండనుందని నిపుణులు హెచ్చరిస్తున్నాం న్నారు. ఈ ఏడాది సాధారణం కంటే 51 శాతం కంటే ఎక్కువగా వర్షపాతం తగ్గుదల ఉంటుందని, దీంతో రైతులు సాగునీటి కష్టాలు ఎదుర్కోనే పరిస్థితులు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కావున రైతులు ఈ ఏడాది నీటి ఎద్దడిని ఎదుర్కొనే ఆరుతడి పంటల సాగు వైపు మొగ్గుచూపాలని తద్వారా ఆర్థికంగా నష్టపోయే ప్రమాదం నుండి తప్పించుకోవచ్చని సూచించారు. అంతేకాకుండా భూగర్భ జలాలు సైతం అడుగంటే ప్రమాదం పొంచి ఉందని హెచ్చరించారు. బోర్లు వేసి వ్యవసాయం చేద్దాం అనే ఆలోచన ను రైతులు చేయవద్దని కోరారు. దీంతో భూగర్భ జలాలు మరింత అటుగంటే ప్రమాదం పొంచి ఉందని మంత్రి పార్థసారథి అన్నారు.

పోలవరం వద్ద గోదావరి నది ప్రతి ఏడాది ఈ సమయానికి దాదాపు లక్ష క్యూసెక్కుల వరద నీరు ప్రవహించేదని కాని ఎల్ నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా పడటంతో ఈ ఏడాది కేవలం 35 నుండి 38వేల క్యూసెక్కుల వరద నీరు మాత్రమే ప్రవహిస్తోందని దీంతో గోదావరి, కృష్ణా పరివాహక ప్రాంతాల్లో సాగు నీరు అందని పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. గోదావరి, కృష్ణా జలాలతో సాగు చేసే రైతులు ఇప్పటికే 70 శాతం మంది రైతులు నాట్లు వేశారని, కాని ఇప్పటి వరకు నాట్లు వేయని రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు మొగ్గ చూపాలని కోరారు. రైతులకు ప్రభుత్వం, వ్యవసాయ శాఖలు అండగా ఉంటాయని, రైతులు కూడా ప్రభుత్వం అందించే సూచనలు, సలహాలు పాటించాలని కోరారు. రైతులను ఆదుకోవడానికి వివిధ రకాల విత్తనాల కిట్లను అందించడానికి వ్యవసాయ శాఖ ఏర్పాట్లు చేస్తోందన్నారు. వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని, ఎల్ నినో ప్రభావం నుండి బయట పడాలని రైతులకు సూచించారు. తాగునీటి సరఫరాకు ట్యాంకర్ల వినియోగంపై కూడా ప్రభుత్వం సమాలోచన చేస్తుందన్నారు. అలాగే పశుగ్రాసం కొరత రాకుండా మెట్ట పంటల సాగు ఆలోచన చేయలని కోరారు. మన రాష్ట్రంలో 59 శాతం ఆయకట్టు భూమి,41 శాతం వర్షాధార పంట భూములు ఉన్నాయని, ఈ ఏడాది ఆరుతడి పంటల వైపు మొగ్గ చూపాలని సూచించారు. అందుకు అవసరమైన విత్తనాల కిట్లను కూడా వ్యవసాయ శాఖ సిద్ధం చేస్తుందన్నారు.

నదుల అనుసంధానంతో అద్భుత ఫలితాలు సాధించవచ్చని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మరో సారి ఉద్ఘాటించారని మంత్రి పార్థసారథి తెలిపారు. ఎల్ నినో ప్రభావాలను తగ్గించడానికి జల వనరులను రెగ్యులైజ్ చేయాలన్న ఆలోచన ముఖ్యమంత్రి చేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి తన ఆలోచనను కేంద్ర ప్రభుత్వం వద్ద ప్రతిపాదించడం జరిగిందన్నారు. గోదావరి నది, కావేరి నదులు వయా బనకచర్ల అనుసంధానం వల్ల మూడు రాష్ట్రాలకు అధిక ప్రయోజనం కలుగుతుందన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభిప్రాయం ఎంతో ఉపయుక్తమైనదన్నారు. కర్ణాటక, తమిళనాడు రిజీయన్ లో ఘర్షణ వాతావరణం సైతం తగ్గటమే కాకుండా తమిళనాడు తాగు నీటి సమస్యలకు చెక్ పెట్టవచ్చున్నారు. గోదావరి, కావేరి నదుల అనుసంధానంపైకర్ణాటక రాష్ట్రాలకు ప్రయోజనకరంగా ఉంటుందని, అంతే కాకుండా ఈ నాలుగు రాష్ట్రాల్లోని రైతులకు మరింత ప్రయోజనం చేకూరుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలోచన చేస్తున్నారన్నారు.

# ఎర్రచందనం మాఫియా మూలాలను పూర్తిగా తుడిచేయాలి

అమరావతి, రాష్ట్రంలో ఎర్రచందనం అక్రమ రవాణాను పూర్తిగా తుడిచిపెట్టే లక్ష్యంతో అటవీ శాఖ ప్రణాళికలకు మరింత పదును పెట్టాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. ఇందుకోసం స్మగ్లింగ్ ముఠాలపై నిఘా పెంచాలని సూచించారు. డ్రోన్ పరిజ్ఞానం, అత్యాధునిక సాంకేతికత వినియోగించుకొంటూ నిఘా పటిష్టం చేయాలని ఆదేశించారు. స్మగ్లింగ్ ముఠాల నెట్ వర్క్ ను మూలాలతో సహా నిర్మూలించేలా చర్యలు తీసుకోవాలని, అక్రమ రవాణాకు ఎలాంటి అవకాశం లేకుండా జీరో టాలరెన్స్ విధానాన్ని కఠినంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. గురువారం క్యాంపు కార్యాలయంలో ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధం, రెండేళ్లలో ఏ మేరకు స్మగ్లింగ్ నిరోధించారు, భవిష్యత్ కార్యాచరణ తదితర అంశాలపై అటవీశాఖ ఉన్నతాధికారులతో పవన్ కళ్యాణ్ సమీక్షించారు. ఈ సందర్భంగా గడచిన రెండేళ్లలో ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టేందుకు అటవీ శాఖ తీసుకున్న చర్యలు, సాధించిన ప్రగతి, నమోదైన కేసుల వివరాలను అధికారులు వివరించారు. 506 కేసులు నమోదు.. 1,239 మంది అరెస్ట్:

గత రెండేళ్లలో ఎర్రచందనం అక్రమ రవాణాపై కఠిన చర్యలు చేపట్టినట్లు అధికారులు ఉప ముఖ్యమంత్రికి వివరించారు. ఈ కాలంలో మొత్తం 506 కేసులు నమోదు చేసి, 1,239 మందిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. అలాగే అక్రమ రవాణాకు ఉపయోగించిన 372 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఎర్రచందనం అక్రమ రవాణాలో కీలకంగా వ్యవహరించిన 12 మంది ప్రధాన స్మగ్లర్లపై పీడీ చట్టం కింద చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

# ల్యాండ్ లిటిగేషన్ ఫ్రీ రాష్ట్రంగా ఏపీ

గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి మీ భూమి-బ్లాక్ చెయిన్ పైలెట్ ప్రాజెక్టును వర్చువల్‌గా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారు. ఈ మేరకు ఈ ప్రాజెక్టులో ఉన్న ఫీచర్స్, ప్రత్యేకతలను సీఎస్ సాయి ప్రసాద్, రెవెన్యూ శాఖ అధికారులు సీఎం చంద్రబాబుకు వివరించారు. భూ రికార్డులకు శాశ్వత భద్రత కల్పించేలా ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనల మేరకు బ్లాక్‌చెయిన్ విధానాన్ని రెవెన్యూ శాఖ రూపొందించినట్టు తెలిపారు. భవిష్యత్తులో భూ సమస్యలకు చెక్ పెట్టేలా ప్రతీ ల్యాండ్ పార్సెల్‌కు ప్రత్యేక డిజిటల్ ఐడీ ఇచ్చి ట్యాంపర్-ప్రూఫ్, సెక్యూరిటీతో లావాదేవీలు జరిగేలా బ్లాక్ చెయిన్ వ్యవస్థను తీర్చిదిద్దినట్టు వెల్లడించారు. ఇక భూ సమస్యలు ఉత్పన్నం కావడానికి డబుల్ రిజిస్ట్రేషన్లు ప్రధాన కారణంగా ఉన్నాయని ఇకపై డబుల్ రిజిస్ట్రేషన్ సమస్యలను నివారించేలా బ్లాక్ చెయిన్ విధానం పని చేస్తోందని అధికారులు వివరించారు. భూ రికార్డులకు సింగిల్ సోర్స్ ఆఫ్ ట్రూత్‌గా ఉండేలా మీ భూమి-బ్లాక్ చెయిన్ ప్రాజెక్టును అందుబాటులోకి తెచ్చామని రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ల శాఖలను ఒకే వేదిక మీదకు తెచ్చేలా ప్రాజెక్ట్ డిజైన్ చేశామని తెలిపారు. ఎన్ఐసి ఆంధ్రప్రదేశ్, ఎన్ఐసి బెంగళూరులోని సెంటరాఫ్ ఎక్స్ లైన్స్ ఇన్ బ్లాక్ చెయిన్ టెక్నాలజీ సంస్థలు సంయుక్తంగా హైపర్ లెడ్జర్ ఫ్యాబ్రిక్ టెక్నాలజీతో మీ భూమి-బ్లాక్ చెయిన్ వ్యవస్థను అభివృద్ధి చేసినట్టు అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఈ ప్రాజెక్టును కర్నూలు, చిత్తూరు, బాపట్ల, కృష్ణా, తూర్పు గోదావరి, పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల్లోని ఒక్కో మండలంలో అమలు చేస్తున్నట్టు తెలిపారు. దీంట్లో భాగంగా ఆస్పరి, పెనుమూరు, రేపల్లె, గన్నవరం, కడియం,




గుమ్మలక్ష్మీపురం, కొత్తవలస మండలాల పరిధిలోని 89 రీ-సర్వే గ్రామాల్లోని 1,37,763 ల్యాండ్ పార్సెల్ మ్యాప్‌లు కవర్ చేసేలా మీ భూమి-బ్లాక్ చెయిన్ పైలట్ ప్రాజెక్ట్ అమలు చేయనున్నట్టు వివరించారు. మీ భూమి-బ్లాక్ చెయిన్ అమలు జరిగే తీరును వివరించే వీడియోను అధికారులు ప్రజెంట్ చేశారు. ఇదే విధానంలో క్యూ ఆర్ కోడ్, ఆధార్ ను అనుసంధానించేలా చూడాలని ముఖ్యమంత్రి సూచించారు.

# అన్ని క్రెడిట్లు ఖాతాలో వేసుకుంటారు కదా

న్యూఢిల్లీ,జూలై23 నీట్ పేపర్ లీక్, చలో పార్లమెంట్ నేపథ్యంలో విద్యార్థులపై పోలీసుల దాడి ఘటనలపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ప్రధాని మోదీపైవిమర్శలు గుప్పించారు. దేశ యువత ఏ విజయం సాధించినా తన ఖాతాలో వేసుకునే ప్రధాని.. విద్యార్థులపై దాడులకు కూడా బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. గురువారం పార్లమెంట్ ఆవరణలో ఆమె మీడియాతో మాట్లాడుతూ.. విద్యార్థులను తాను ఎంతో ప్రేమగా చూసుకుంటానని సోషల్ మీడియా వేదికగా పోస్టులు పెట్టే ప్రధాని మోదీ.. వారిపై బాష్పవాయువు ప్రయోగించి, లాఠీఛార్జ్ చేయించారని విమర్శించారు. అధికార పక్షానికి చెందిన ఎంపీలు పార్లమెంట్ బయట నిల్చొని ఆందోళన చేయడం ఎప్పుడైనా చూశామా? పార్లమెంట్ సమయాన్ని వృథా చేస్తున్నారు. మనం అసలు ప్రజాస్వామ్యంలోనే జీవిస్తున్నామా? పిల్లలు ఆందోళన చేస్తుంటే ఇంటర్నెట్ కట్ చేస్తున్నారు. అంగారకుడిపైకి వెళ్లినా, రాకెట్లు ప్రయోగించినా వాటినీ తన ఖాతాలోనే వేసుకుంటారు. ఆయన అధికారంలో ఉన్నప్పుడు దాదాపు 152 పేపర్ లీకేజీలు జరిగాయి. వాటికి బాధ్యులెవరు? ప్రస్తుతం విద్యార్థులపై జరుగుతున్న దాడులకు బాధ్యులెవరు? విజయాలను తన ఖాతాలో వేసుకుంటున్న మోదీ.. వీటికి కూడా బాధ్యత వహించాలని ప్రియాంక గాంధీ డిమాండ్ చేశారు.

# కాంగ్రెస్‌ది చిత్తశుద్ధి లేని పోరాటం

న్యూఢిల్లీ,జూలై23:న్యూఢిల్లీలోని ప్రధాని నివాసం ముందు ఈనెల 21న నీట్ పేపర్ లీక్ అంశంపై కాంగ్రెస్ నిరసన కార్యక్రమం చేపట్టడాన్ని సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ భార్య గీతాంజలి విమర్శించారు. కాంగ్రెస్ నిరసనల్లో చిత్తశుద్ధి లోపించిందని అన్నారు. జంతర్‌మంతర్ వద్ద విద్యార్థులు నిరసనకు దిగినప్పుడే కాంగ్రెస్ కూడా వచ్చి నిరసనల్లో పాలుపంచుకుని ఉండాల్సిందని వ్యాఖ్యానించారు. పేపర్ లీక్ ఉదంతంపై సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ జంతర్‌మంతర్ వద్ద తొలుత ఆమరణ దీక్ష ప్రారంభించిన విషయం తెలిసిందే. ఆ తరువాత పోలీసులు ఆయనను ఆసుపత్రికి తరలించడంతో ప్రస్తుతం అక్కడే దీక్షను కొనసాగిస్తున్నారు. నిరసనల్లో రాజకీయ పార్టీలు కూడా రంగ ప్రవేశం చేయడంపై వాంగ్‌చుక్ భార్య పలు కీలక వ్యాఖ్యలు చేశారు. వాంగ్‌చుక్ పేరుప్రఖ్యాతులను తమకు అనుకూలంగా వాడుకునేందుకు రాజకీయ పక్షాలు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. అయితే, ప్రజలను మభ్యపెట్టడం ఇక సాధ్యం కాదని అన్నారు. చిత్తశుద్ధి లేని వారిని యువతే పంపించేస్తారని అన్నారు.

### ఆర్‌డబ్ల్యూఎస్ కాంట్రాక్ట్ కార్మికులకు

# వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుంది

సకాలంలో వేతనాలు లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

థర్డ్ పార్టీ కాంట్రాక్ట్ విధానం కారణంగా అనేక జిల్లాల్లో కార్మికులకు చెల్లించాల్సిన ఎస్ఎస్ఆర్ రేట్లను తగ్గించి ఇస్తున్నారని వైయస్ జగన్ దృష్టికి తీసుకువచ్చారు. కొన్ని ప్రాంతాల్లో 10 నుంచి 20 నెలల వరకు వేతనాలు చెల్లించకపోవడంతో కార్మికుల కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని వాపోయారు. నెలల తరబడి జీతాలు అందకపోవడంతో కుటుంబ పోషణ, పిల్లల చదువులు, వైద్య ఖర్చులు భరించలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. సంవత్సరాలుగా సేవలందిస్తున్న కార్మికుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం అన్యాయమని పేర్కొన్నారు. థర్డ్ పార్టీ కాంట్రాక్ట్ వ్యవస్థను రద్దు చేయడంతో పాటు పెండింగ్‌లో ఉన్న వేతన బకాయిలను తక్షణమే చెల్లించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని యూనియన్ ప్రతినిధులు వైయస్ జగన్‌ను కోరారు. కార్మికులకు నిర్ణీత రేట్ల ప్రకారం వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

# నేతన్న సేవతో ఆర్థిక దన్ను

అమరావతి, : రాష్ట్రంలో చేనేత కళాకారులు గౌరవప్రదమైన జీవనం సాగించడమే సీఎం చంద్రబాబు లక్ష్యమని ఇందులో భాగంగా నేతన్నలకు ఆర్థిక దన్ను కలిగేలా నేతన్న సేవలో పథకానికి శ్రీకారం చుడుతున్నామని రాష్ట్ర చేనేత జౌళి శాఖ మంత్రి సవిత వెల్లడించారు. నేతన్న సేవలో పథకం కింద రాష్ట్ర వ్యాప్తంగా 51,952 మంది నేతన్నలకు ఆర్థిక లబ్ధి కలిగేలా ఏటా రూ. 25 వేలు అందజేయనున్నట్లు తెలిపారు. ఇందుకోసం బడ్జెట్ లో రూ.250 కోట్లు కేటాయించామని, వచ్చే నెల ఏడో తేదీన జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఈ పథకాన్ని ప్రారంభించ నున్నామన్నారు. రాష్ట్రం చేనేత రంగ అభివృద్ధికి విశేష కృషి చేసిన ప్రజాబంధు ప్రగడ కోటయ్య జయంతిని ఈ నెల 26న రాష్ట్ర పండుగగా నిర్వహించనున్నామన్నారు. రాష్ట్ర సచివాలయంలోని తన ఛాంబర్ లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. నేతన్నలకు ఆర్థిక భరోసా కలిగించేలా కూటమి ప్రభుత్వం మరో శుభవార్త చెప్పిందన్నారు. నేతన్న సేవలో పథకానికి సీఎం చంద్రబాబు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని ఈ మేరకు కేబినెట్ లో ఆమోదం తెలిపినట్లు వెల్లడించారు. ఆగస్టు ఏడో తేదీన జాతీయ చేనేత దినోత్సవం నాడు నేతన్న సేవలో పథకానికి శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు.ఈ పథకం ద్వారా ఏటా 51,952 మంది నేతన్నలకు రూ. 25 వేల ఆర్థిక సాయం అందజేయ నున్నామన్నారు. చేనేతలకు ఆర్థిక దన్ను కలిగించేలా నేతన్న సేవలో పథకానికి శ్రీకారం చుట్టిన సీఎం చంద్రబాబుకు మంత్రి సవిత ధన్యవాదాలు తెలిపారు.

## జూలై 30న ఆరు జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ

అమరావతి, భీమోదయం: భోగాపురం ఎయిర్‌పోర్ట్‌ను ఆగస్టు 1న ప్రారంభిస్తోన్న నేపథ్యంలో ఏపీలో ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాల్లో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఈ నెల 30న చేపట్టనున్నారు. రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పూర్తి చేసిన అల్లూరి సీతారామరాజు ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌ను ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఆగస్టు 1వ తేదీన ప్రారంభిస్తున్నారని, ఈ క్రమంలోనే లబ్ధిదారులకు ఇబ్బంది లేకుండానే ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాల్లో ఒక రోజు ముందుగానే ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి తెలిపారు. ఈ ఆరు జిల్లాల్లో మొత్తం పెన్షన్ల పంపిణీ కోసం అవసరమైన నగదు ఉపసంహరణ కార్యక్రమాన్ని ఈ నెల 29నే పూర్తి చేసేలా సంబంధిత అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు.

# ఆందోళనకారులకు మద్దతుగా నిలిచిన యువతి

## పోలీస్ వ్యాన్‌కు అడ్డంగా నిలబడి ఆందోళనకారుల విడుదలకు యత్నం
## సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న వీడియో

ముంబై,జూలై23 కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలంటూ, పరీక్షల నిర్వహణలో అక్రమాలు జరిగాయంటూ.. దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తున్నాయి. ఈ నేపథ్యంలో మహారాష్ట్రలోని ముంబైలో చోటుచేసుకున్న ఓ ఘటన నెట్టింట తెగ వైరల్ అవుతోంది. ఆందోళనకారులను తీసుకెళ్తున్న పోలీసు వ్యాన్‌కు ఓ యువతి అడ్డుగా నిలిచి నిరసన తెలిపారు. దాదర్‌లోని శివాజీ పార్క్ సమీపంలో జరిగిన విద్యార్థుల నిరసనల్లో రియా యాదవ్ అనే యువతి ఈ సాహసానికి పాల్పడ్డారు.వర్షంలో హుడీ, టోపీ ధరించి పోలీసు వ్యాన్ ఎదుట నిల్చున్న ఆమెను చూసి.. అక్కడి నిరసనకారులు మరింత రెచ్చిపోయారు. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. దీంతో అప్పటికే అదుపులోకి తీసుకున్న కొందరు నిరసనకారులను పోలీసులు విడుదల చేసినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా రియా స్పందిస్తూ.. 'పోలీసులు తమ బాధ్యతల్ని సక్రమంగా నిర్వర్తించడం లేదు. వారు బాధ్యతగా వ్యవహరించకపోతే పౌరుల కోసం మేమే బాధ్యత తీసుకుంటాం' అని అన్నారు. తాను





విద్యార్థిని కాకపోయినప్పటికీ.. విద్యార్థుల ఉద్యమానికి సంపూర్ణ మద్దతిస్తానని ఆమె చెప్పుకొచ్చారు. మరోవైపు.. ఢిల్లీలో నిరసనకారులపై టియర్‌గ్యాస్, లాఠీఛార్జ్ వంటి ఘటనలనూ ఆమె ఖండించారు. రియా యాదవ్.. నటి, మోడల్, పారిశ్రామికవేత్తగా గుర్తింపు పొందారు. ఆమెకు ఇన్‌స్టాగ్రామ్‌లో సుమారు లక్ష మంది వరకు ఫాలోవర్స్ ఉన్నారు. పలు మ్యూజిక్ వీడియోల్లో నటించిన ఆమె.. ఇటీవల 'దిల్‌బారా' అనే సాంగ్‌తో మెరిశారు. అలాగే 'రియాసత్' పేరుతో ఓ చేనేత వస్త్రాల బ్రాండ్‌నూ నిర్వహిస్తున్నట్లు సమాచారం.

# 25 ఏళ్ల తరువాత మంచికల్లు కి మంచి రోజులు

- మీూా జూలకంటి బ్రహ్మనంద రెడ్డి కృషి.
- గోగుల వెంకటరామిరెడ్డి పట్టుదల ఫలితం.
- పర్యావరణాన్ని రక్షించుకోవడం కోసం రోడ్డుకి ఇరువైపులా చెట్లు.



ఐ ఎన్ బి టైమ్స్ మాచర్ల ప్రతినిధి జులై 23 :
మాచర్ల నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి. సుమారు 25 సంవత్సరాలుగా రోడ్డు సౌకర్యానికి నోచుకోని మంచికల్లు గ్రామానికి తెలుగుదేశం ప్రభుత్వం మహర్దశ కల్పించింది. మాచర్ల నియోజకవర్గ శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానంద రెడ్డి ఆధ్వర్యంలో మంచికల్లు గ్రామానికి 3 కిలోమీటర్ల తార రోడ్డు, 600 మీటర్ల సిమెంట్ రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేశారు. వీటి నిర్మాణానికి ప్రభుత్వం సుమారు 1 కోటి 80 లక్షల రూపాయలు ఖర్చు చేసింది. గతంలో మట్టి రోడ్డు ఉండటం వల్ల మంచికల్లు గ్రామం నుండి ప్రధాన రహదారికి వెళ్ళటానికి వర్షాకాలంలో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. రోగులను ఆసుపత్రికి తరలించడం, పంటలను మార్కెట్‌కు తీసుకెళ్లడం దాదాపు అసాధ్యంగా ఉండేది. కూలి పనిచేయడానికి వచ్చే కూలీల వాహనాలకు మట్టి ఇరుక్కుని ఇబ్బంది పడ్డ రోజులు చెప్పుకోలేనివి. విద్యార్థులు బురదలో నడుచుకుంటూ స్కూళ్లకు వెళ్లే పరిస్థితి ఉండేది. ఈ సమస్యలను గుర్తించిన గోగుల వెంకట్రామిరెడ్డి వెంటనే మాచర్ల నియోజకవర్గం ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. వెంటనే ఈ విషయం మీద అధికారులతో చర్చించి ప్రత్యేక నిధులు మంజూరు చేయించారు. రోడ్డు నిర్మాణ పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టారు. 3 కి.మీ తార రోడ్డుతో పాటు గ్రామంలోని ప్రజలు వెళ్లే ఆటో స్టాండ్ దగ్గర నుండి ప్రధాన రహదారుల్లో 600 మీటర్ల సిమెంట్ రోడ్డును కూడా వేశారు. దీంతో గ్రామానికి వచ్చే ప్రధాన రహదారి నుండి గ్రామం వరకు రాకపోకలు సుగమమయ్యాయి. ఈ అభివృద్ధి కార్యక్రమం వెనుక టీడీపీ సీనియర్ నాయకులు గోగుల వెంకటరామిరెడ్డి కృషి విశేషంగా ఉంది. గత కొన్ని సంవత్సరాలుగా గ్రామస్తుల సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, ప్రభుత్వ స్థాయిలో ఫాలోఅప్ చేసి నిధులు రాబట్టడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. గ్రామానికి పెద్ద కొడుకు తరహాలో బాధ్యత వహించి ఎవరికీ ఏ కష్టం వచ్చినా నేనున్నాను అని ధైర్యం చెబుతూ గ్రామంలో ఎవరు చనిపోయిన కుల మత పార్టీ వర్గాలు లేకుండా వారి వారి కుటుంబ సభ్యులకు మట్టి ఖర్చుల నిమిత్తం తన వంతు సహాయంగా 10,000 ల రూపాయలు సహాయం ఎంత మందికి చేయడం జరుగుతుంది. అభివృద్ధితో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా ప్రాధాన్యత ఇచ్చారు. కొత్తగా వేసిన రోడ్డుకు ఇరువైపులా వందలాది మొక్కలు నాటించారు. రాబోయే రోజుల్లో ఈ రోడ్డు హరిత కారిడార్‌గా మారేలా చర్యలు తీసుకుంటున్నామని నాయకులు తెలిపారు. రోడ్డు ప్రారంభోత్సవానికి గ్రామస్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానంద రెడ్డి, గోగుల వెంకటరామిరెడ్డి లకు గ్రామస్తులందరూకృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ, "గత 25 సంవత్సరాలుగా మేము పడిన కష్టాలు వర్ణనాతీతం. మా సమస్యను తెలుగుదేశం ప్రభుత్వం పరిష్కరించింది. ఎమ్మెల్యే గారికి, వెంకటరామిరెడ్డి గారికి మా జీవితాంతం రుణపడి ఉంటాం" అని ఆనందం వ్యక్తం చేశారు.రైతులు మాట్లాడుతూ, "ఇప్పుడు మా పంటలను ఎటువంటి నష్టం లేకుండా తక్కువ ఖర్చుతో మార్కెట్‌కు తరలించగలుగుతున్నాం. రవాణా సమస్య తీరడంతో ఆదాయం పెరుగుతుంది" అని చెప్పారు. మహిళలు మాట్లాడుతూ, "రాత్రి పూట అత్యవసర సమయంలో ఇప్పుడు అంబులెన్స్ గ్రామంలోకి సులువుగా వస్తుంది. మా బిడ్డల భవిష్యత్తుకు ఇది ఎంతో మేలు చేస్తుంది" అని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మంచికల్లు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, యువత పాల్గొన్నారు. రాబోయే రోజుల్లో మంచికల్లు గ్రామంలో తాగునీటి సమస్య, డ్రైనేజీ, వీధి లైట్ల సమస్యలను కూడా పరిష్కరిస్తామని గోగుల వెంకటరామిరెడ్డి హామీ ఇచ్చారు. అలాగే ఈ నూతన రోడ్డు పై పొలం పనులకు వెళ్లే ఈరుసుల ట్రాక్టర్ల వల్ల రోడ్లు త్వరగా పాడైపోయే పరిస్థితి కనపడుతుంది కనుక ప్రతి ఒక్కరు మన రోడ్డుని మనమే కాపాడుకోవాల్సిన బాధ్యత మనదే. ప్రతి ఒక్క ట్రాక్టర్ యజమాని పొలంలోకి వెళ్ళిన తర్వాత మాత్రమే ఇరుసుల టైర్లు తగిలించుకోవాలి. అలా కాదని ఎవరైనా రోడ్లపైకి వస్తే వారికి 20 వేల రూపాయలు జరిమానా దానితోపాటు చట్టపరంగా తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

మాచర్ల నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని, ప్రతి గ్రామానికి మౌలిక సదుపాయాలు కల్పిస్తామని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానంద రెడ్డిస్పష్టం చేశారు. తెలుగుదేశం ప్రభుత్వం మాట ఇస్తే మాట నిలబెట్టుకునే ప్రభుత్వమని, ప్రజా సంక్షేమమే తమ ధ్యేయమని అన్నారు.

మొత్తంగా 25 ఏళ్ల సమస్యకు పరిష్కారం చూపిన ఈ రోడ్డు నిర్మాణం మంచికల్లు గ్రామ చరిత్రలో సువర్ణ అధ్యాయంగా నిలిచిపోతుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

# పాడి రక్షణే కూటమి ప్రభుత్వ తక్షణ కర్తవ్యం..!

## -ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

ఐ ఎన్ బి టైమ్స్ మాచర్ల ప్రతినిధి జూలై 23:
పాడి పశువుల రక్షణే కూటమి ప్రభుత్వ తక్షణ కర్తవ్యమని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి చెప్పారు. నియోజకవర్గంలోని శిధిలావస్థలో ఉన్న పశు వైద్యశాలల పునర్నిర్మాణానికి కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం పట్ల ఎమ్మెల్యే గురువారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. రైతాంగ మనుగడకు, పంటల దిగుబడికి దోహదం చేసే పాడి పశువుల ప్రాధాన్య గురించి తెలిసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, వాటి సంవృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని పేర్కొన్నారు. నియోజకవర్గంలో అధ్వానంగా ఉన్న పశు వైద్యశాలల నూతన భవనాల నిర్మాణాలకు గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబును వెలగపూడి సచివాలయంలో కలిసి, నిధుల మంజూరుకు వినతి పత్రం సమర్పించామన్నారు. శిథిలావస్థకు చేరిన పశువైద్యశాల భవనాల స్థానంలో నూతన భవనాల నిర్మాణాలకు అందించిన వినతి మేరకు స్పందించిన సీఎం నిధులు మంజూరుకు ఆదేశాలు జారీ చేశారన్నారు. రెంటచింతల మండల కేంద్రం, మంచికల్లు గ్రామాల్లోని పశువైద్యశాల నిర్మాణానికి రూ. 50 లక్షలు నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం పరిపాలన అనుమతులు ఇచ్చిందని చెప్పారు. ముంజూరైన నిధులతో రూ.30 లక్షలతో రెంటచింతల పశువైద్యశాల, రూ.20 లక్షలతో మంచికల్లు గ్రామ పశువైద్యశాల పాత భవనాల స్థానంలో నూతన భవనాలను నిర్మించనున్నామని ఆయన



వెల్లడించారు. పల్నాడు జిల్లా అత్యంత వెనుకబడిన మాచర్ల నియోజకవర్గ అభివృద్ధికి అడిగిందే తడువుగా కుప్పంతో సమానంగా ముఖ్యమంత్రి చంద్రబాబు పెద్ద ఎత్తున నిధులు అందిస్తూ.., ప్రజల హృదయాల్లో అభివృద్ధి ప్రదాతగా చెరగని ముద్ర వేసుకుంటున్నారని ఎమ్మెల్యే జూలకంటి కొనియాడారు.

# ఇంటింటికీ చెట్టును ప్రారంభించిన సర్పంచ్

నిజమాబాద్,జూలై23 నిజామాబాద్ జిల్లా వేల్పూర్ మండలం కొత్తపల్లి గ్రామంలో పచ్చదనం పెంపు లక్ష్యంగా గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో 'ఇంటింటికీ చెట్టు' కార్యక్రమాన్ని సర్పంచ్ విజయకృష్ణారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా తొలి మొక్కను స్వయంగా నాటి, ప్రతి ఇంటి వద్ద ఒక చెట్టును పెంచే బాధ్యత తీసుకోవాలని గ్రామస్తులకు పిలుపునిచ్చారు. వాతావరణ మార్పులు, పెరుగుతున్న ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకుని కొత్తపల్లిని హరిత గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని తెలిపారు. నేరేడు, వేప, మామిడి, చింత, రావి వంటి నీడనిచ్చే, ఔషధ గుణాలున్న మొక్కలను గ్రామస్తులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రతి కుటుంబం ఒక మొక్కను దత్తత తీసుకుని సంరక్షించాలని సూచించారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని పెంచి పెద్ద చేయడమే నిజమైన బాధ్యత అని అన్నారు. గ్రామంలోని పార్కులు, రహదారుల వెంట, ప్రభుత్వ స్థలాల్లో కూడా విస్తృతంగా మొక్కలు నాటి వాటికి రక్షణ కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పంచాయతీ సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# సెలవు పెట్టినందుకు ఉద్యోగం నుంచి తొలగింపు

## టెక్ మహీంద్రా సంస్థ ఉద్యోగిని ఫిర్యాదు



హైదరాబాద్,జూలై23 ప్రముఖ ఐటీ సంస్థ టెక్ మహీంద్రాపై మహిళా సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని భావన దుండిగల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనారోగ్యం కారణంగా తాను, అనంతరం తన చిన్నారి ఆరోగ్యం బాగోలేక సెలవులు తీసుకున్న నేపథ్యంలో ఎలాంటి ముందస్తు నోటీసు ఇవ్వకుండా సంస్థ ఉద్యోగం నుంచి తొలగించిందని ఆమె ఆరోపించారు. భావన తెలిపిన వివరాల ప్రకారం, అనారోగ్యంతో 13 రోజుల పాటు సెలవులో ఉన్న సమయంలో, అలాగే తన కుమార్తె అనారోగ్యం కారణంగా మరికొన్ని రోజులు సెలవు తీసుకున్నప్పటికీ, యాజమాన్యం ఈ-మెయిల్‌ల ద్వారా వెంటనే విధులకు హాజరు కావాలని ఒత్తిడి తెచ్చిందని పేర్కొన్నారు. వ్యక్తిగత పరిస్థితులను పరిగణనలోకి తీసుకోకుండా వేధింపులకు గురిచేశారని ఆమె ఆరోపించారు. అంతేకాకుండా, కార్యాలయంలో వాష్‌రూమ్‌కు వెళ్లాలన్నా అనుమతి తీసుకోవాల్సిన పరిస్థితి ఉండేదని, ఉద్యోగులపై అత్యంత కఠినమైన నిబంధనలు అమలు చేస్తున్నారని ఆమె ఆరోపించారు. మహిళా ఉద్యోగులకు కుటుంబ బాధ్యతలు, చిన్నారుల సంరక్షణ వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని ఐటీ సంస్థలు మరింత మానవీయ దృక్పథంతో వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. భావన ఫిర్యాదును స్వీకరించిన దుండిగల్ పోలీసులు ఘటనకు సంబంధించిన వివరాలను పరిశీలిస్తున్నారు. మరోవైపు, ఈ ఆరోపణలపై టెక్ మహీంద్రా యాజమాన్యం నుంచి అధికారిక స్పందన రావాల్సి ఉంది.

# ఈ నెల 25న వేపకంపల్లిలో రైతులకు రాజముద్రతో కూడిన పాసుపుస్తకాల పంపిణీ



ఐ ఎన్ బి టైమ్స్ మాచర్ల ప్రతినిధి జూలై 23 :
కూటమి ప్రభుత్వం అందజేస్తున్న రాజముద్రతో కూడిన నూతన పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ కార్యక్రమం కారంపూడి మండలంలో ఘనంగా జరగనుంది.కారంపూడి మండల పరిధిలోని వేపకంపల్లి, చినకొదంగడ్ల గ్రామాల రైతులకు పాసుపుస్తకాలను ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి చేతులమీదుగా అందజేయనున్నట్లు గురువారం ఎమ్మెల్యే కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.ఈ నెల 25న అనగా శనివారం ఉదయం 11 గంటలకు వేపకంపల్లి గ్రామంలోని బొడ్రాయి సెంటర్ వద్ద ఈ కార్యక్రమం జరుగనుంది. దాదాపు 1500 మంది రైతులకు నూతన పట్టాదారు పాసుపుస్తకాలను పంపిణీ చేయనున్నారు.ఈ కార్యక్రమానికి సంబంధించిన అన్ని ఏర్పాట్లను రెవెన్యూ అధికారులు ఇప్పటికే పూర్తి చేశారని అధికారులు తెలిపారు.రైతులకు భూమిపై పూర్తి హక్కు కల్పించేందుకు, పారదర్శకత కోసం ప్రభుత్వం ఈ రాజముద్రతో కూడిన పాసుపుస్తకాలను అందజేస్తున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం పేర్కొంది.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, రెవెన్యూ సిబ్బంది, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొననున్నారు.




## విశ్వనాథం అండ్ సన్స్ నుంచి కొత్త లుక్ విడుదల

కోలీవుడ్ స్టార్ హీరో సూర్యకు తమిళంతో పాటు తెలుగులోనూ భారీ అభిమాన వర్గం ఉంది. ఇటీవల విడుదలైన 'వీరభద్రుడు' సినిమాతో మాస్ హిట్ అందుకున్న ఆయన, ఇప్పుడు మరో ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతున్నారు. టాలీవుడ్ దర్శకుడు వెంకీ అట్లూరి తెరకెక్కిస్తున్న 'విశ్వనాథ్ అండ్ సన్స్' సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. సూర్య పుట్టినరోజు సందర్భంగా చిత్రబృందం విడుదల చేసిన కొత్త పోస్టర్లు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ముఖ్యంగా బ్రౌన్ కలర్ సూట్‌లో సూర్య కనిపించిన స్టైలిష్ లుక్ అభిమానులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. చాలా కాలం తర్వాత సూర్యను ఇలాంటి క్లాస్, వింటేజ్ స్టైల్‌లో చూడటం ఫ్యాన్స్‌కు ప్రత్యేకమైన ఆనందాన్ని కలిగిస్తోంది. ఈ పోస్టర్లతో సినిమాపై మరింత హైప్ పెంచిన మేకర్స్ మరో సర్‌ప్రైజ్ కూడా ప్రకటించారు. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్‌కు మంచి స్పందన రావడంతో, ఈ కొత్త పాటపై కూడా అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది. ఈ చిత్రం కుటుంబ భావోద్వేగాలతో కమర్షియల్ అంశాలను కలగలిపిన కథతో తెరకెక్కుతున్నట్లు

తెలుస్తోంది.

## బోల్డ్ సన్నివేశాల్లో నటించలేను: కాజల్



టాలీవుడ్ స్టార్ హీరోయిన్ కాజల్ అగర్వాల్ మరోసారి తన వ్యక్తిగత అభిప్రాయాలను స్పష్టంగా వెల్లడించారు. సినిమాల్లో బికినీ, బోల్డ్ సన్నివేశాలు, రొమాంటిక్ సీన్స్‌పై ఇటీవల జరుగుతున్న చర్చల మధ్య ఆమె చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ముఖ్యంగా పెళ్లి తర్వాత హీరోయిన్లు గ్లామర్ పాత్రలు చేయడంపై వస్తున్న విమర్శల నేపథ్యంలో కాజల్ స్పందించిన తీరు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ప్రస్తుతం 'ది ఇండియా స్టోరీ' సినిమా ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్న కాజల్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, కెరీర్ ప్రారంభం నుంచే తాను బికినీ లేదా అతిగా బోల్డ్ సన్నివేశాల్లో నటించడానికి ఆసక్తి చూపలేదని తెలిపారు. అలాంటి పాత్రలు చేయడం తనకు వ్యక్తిగతంగా అసౌకర్యంగా అనిపిస్తుందని, అందుకే ఎన్నో భారీ చిత్రాలను కూడా వదులుకున్నానని వెల్లడించారు. సినిమాల కోసం లేదా డబ్బు కోసం నా వ్యక్తిత్వాన్ని మార్చుకోలేను. నాకు కొన్ని విలువలు, సిద్ధాంతాలు ఉన్నాయి. వాటిని నేను ఎప్పుడూ రాజీ పడను. తెరపై బోల్డ్ సీన్స్ చేయాల్సిన అవసరం ఉందని నేను భావించను అని కాజల్ స్పష్టం చేశారు. తల్లి అయిన తర్వాత తన ఆలోచనల్లో మరింత మార్పు వచ్చిందని కూడా ఆమె తెలిపారు. తన కుమారుడు నీల్ కిచ్లూ పెద్దయ్యాక తన సినిమాలు చూసి గర్వపడాలని కోరుకుంటానని, తన నటించిన

పాత్రల గురించి భవిష్యత్తులో తన బిడ్డకు వివరణ ఇవ్వాల్సిన పరిస్థితి రాకూడదనే ఉద్దేశంతో కథలు, పాత్రల ఎంపికలో మరింత జాగ్రత్తగా వ్యవహరిస్తున్నట్లు చెప్పారు.

నా కొడుకు నా సినిమాలు చూసి గర్వపడాలి. అతను అసౌకర్యంగా ఫీలయ్యే పాత్రలు నేను చేయాలనుకోవడం లేదు. అందుకే ఇప్పుడు ప్రతి కథను చాలా ఆలోచించి ఎంపిక చేసుకుంటున్నాను అని ఆమె పేర్కొన్నారు. ఇదిలా ఉంటే, ఇటీవల 'టాక్సిక్' సినిమాలో యశ్‌తో కలిసి నటించిన కియారా అద్వానీ రొమాంటిక్ సన్నివేశాలపై సోషల్ మీడియాలో ట్రోలింగ్ జరిగిన నేపథ్యంలో కాజల్ పాత వ్యాఖ్యలు మళ్లీ వైరల్ అవుతున్నాయి.



## రణ్‌వీర్ ప్రళయ్‌లో దక్షిణాది బ్యూటీ కళ్యాణి ప్రియదర్శన్ ?

బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌వీర్ సింగ్ నటిస్తున్న భారీ బ్జడెట్ చిత్రం 'ప్రళయ్'పై ఇప్పటికే సినీ వర్గాల్లో మంచి అంచనాలు నెలకొన్నాయి. తాజా వార్త ఇప్పుడు మరింత ఆసక్తిని పెంచుతోంది. ఈ చిత్రంలో హీరోయిన్‌గా దక్షిణాది నటి కళ్యాణి ప్రియదర్శన్ ఎంపికైనట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. కళ్యాణి ప్రియదర్శన్ ఇప్పటికే తెలుగు, తమిళం, మలయాళ భాషల్లో పలు విజయవంతమైన చిత్రాల్లో నటించి మంచి గుర్తింపు సంపాదించారు. సహజమైన నటన, అందంతో యువతలో ప్రత్యేకమైన ఫాలోయింగ్ ఏర్పరచుకున్న ఆమెకు ఇప్పుడు బాలీవుడ్‌లో భారీ అవకాశం దక్కబోతుందనే వార్త చర్చనీయాంశంగా మారింది. రణ్‌వీర్ సింగ్ వంటి స్టార్ హీరో సరసన నటించే అవకాశం రావడం ఆమె కెరీర్‌లో కీలక మలుపుగా భావిస్తున్నారు.

రణ్‌వీర్ సింగ్ తన ఎనర్జిటిక్ స్క్రీన్ ప్రెజెన్స్, విభిన్న పాత్రలతో ప్రేక్షకులను అలరిస్తూ వస్తున్నారు. అలాంటి హీరోతో కళ్యాణి జోడీ కట్టడం సినిమాపై మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ ఇద్దరి మధ్య కెమిస్ట్రీ ఎలా ఉంటుందో తెలుసుకోవాలని అభిమానులు ఎదురుచూస్తున్నారు. ముఖ్యంగా దక్షిణాది ప్రేక్షకుల్లో కూడా ఈ కాంబినేషన్‌పై చర్చ మొదలైంది. యాక్షన్ సీక్వెన్సులతో పాటు భావోద్వేగాలకు కూడా ప్రాధాన్యత ఇచ్చే కథగా రూపొందుతోందని సినీ వర్గాలు చెబుతున్నాయి.

## రాజకీయ ఎంట్రీ ఆధారంగా రూపొందిన జననాయగన్

తమిళనాడు ముఖ్యమంత్రి, కథానాయకుడు విజయ్ నటించిన చివరి చిత్రం 'జన నాయగన్' తెలుగులో 'జన నాయకుడు' పేరుతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. సంక్రాంతికి విడుదల కావాల్సిన ఈ మూవీ సమస్యలను దాటుకుని ఎట్టకేలకు విడుదలైంది. దళపతి వెట్రి కొండాన్ (విజయ్) ఓ ఖైదీగా జైలు జీవితాన్ని గడుపుతుంటాడు. ఓ వ్యాపారవేత్తని అంతం చేయడానికి జైలుపై పడిన ముఠాని ఎదురించి నిజాయతీ కలిగిన జైలు అధికారి (గౌతమ్ మేనన్) దృష్టిని ఆకర్షిస్తాడు. ఆ అధికారి సాయంతో ఆగస్టు 15న క్షమాభిక్ష కింద బయటకొస్తాడు వెట్రి. అంతలోనే ఆ అధికారి ఓ ప్రమాదంలో మరణిస్తాడు. దాంతో అతని కుమార్తె విజ్జి (మమిత బైజు)ని పెంచే బాధ్యతని వెట్రి తన భుజాన వేసుకుంటాడు. చిన్నప్పుడు తల్లి దారుణ హత్యని ప్రత్యక్షంగా చూసిన విజ్జి ప్రతి చిన్న విషయానికీ భయంతో వణికిపోతుంటుంది. ఆమెను ధైర్యవంతురాలిగా మార్చి, సైన్యంలో చేర్పించాలని నిర్ణయించుకుంటాడు. అందుకోసం శిక్షణ కూడా ఇప్పిస్తుంటాడు. ఇంతలో జాన్ హిమ్లర్ (బాబీ దేవోల్) విజ్జిని లక్ష్యంగా చేసుకుని ఆమెని అంతం చేయాలని తన ముఠాని పంపుతాడు. ఇంతకీ విజ్జిని జాన్ హిమ్లర్ లక్ష్యంగా చేసుకోవడానికి కారణమేమిటి? హిమ్లర్ ఎవరు? అతన్ని వెట్రి కొండాన్ ఎలా ఎదిరించాడు? విజ్జిలోని భయాన్ని పోగొట్టి ఆమెని ధైర్యవంతురాలిగా మార్చాడా? లేదా? విద్వేషాల్ని రగిలించడానికి పతకం వేసిన జాన్ హిమ్లర్ అసలు లక్ష్యమేమిటి? ఆయనకీ రాజకీయ నాయకుడు రోజా రంగస్వామి (ప్రకాశ్‌రాజ్)కీ మధ్య సంబంధం ఏమిటన్నది కథ. తెలుగులో విజయంతమైన 'భగవంత్




కేసరి' స్ఫూర్తితో రూపొందిన చిత్రమిది. ఇది మక్కీకి మక్కీ రీమేక్ కానప్పటికీ... ఆ కథలోని ఆత్మ, పాత్రలు పక్కాగా కనిపిస్తాయి. దాంతో తెలుగు ప్రేక్షకులకు అడుగడుగునా 'భగవంత్ కేసరి' సినిమానే గుర్తొస్తుంది. విజయ్ రాజకీయ అజెండా, మితిమీరిన వాణిజ్యాంశాల మధ్య కథలోని అసలు ఆత్మ నలిగిపోయింది. తమిళనాడు

ఎన్నికలకు ముందు రూపొందిన ఈ సినిమా విజయ్ రాజకీయ ఆలోచనల్ని, అజెండాని మాత్రం పక్కాగా తెరపై ఆవిష్కరించింది. ఆయనకు రాజకీయంగా లబ్ధి చేకూర్చే విషయాలు సినిమాలో అడుగడుగునా కనిపిస్తాయి. ఓ సన్నివేశంలో తమ్ముడూ... అంటూ విజయ్ చేతికి చెర్నాకోల అందిస్తారు

## టాక్సిస్ ..భిన్నమైన కథాంశంతో రూపొందించిన చిత్రం




కేజీఎఫ్ సిరీస్‌తో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన రాక్ స్టార్ యశ్ నటిస్తున్న తాజా పాన్ ఇండియా చిత్రం 'టాక్సిక్: చిత్రం ఆగస్టు 26న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఇటీవల విడుదలైన టీజర్, ప్రోమో వీడియోలు, పాటల్లో కనిపించిన బోల్డ్ కంటెంట్ సోషల్ మీడియాలో పెద్ద చర్చకు దారితీసింది. ఈ నేపథ్యంలో చిత్ర నిర్మాత కె. వెంకట నారాయణ తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో సినిమాపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. టాక్సిక్ సాధారణ కమర్షియల్ సినిమా కాదని, తాము ఇప్పటివరకు నిర్మించిన చిత్రాల కంటే పూర్తిగా భిన్నమైన కథాంశంతో రూపొందించామని ఆయన తెలిపారు. ప్రేక్షకులు థియేటర్లలో ఈ సినిమాను చూసిన తర్వాత తప్పకుండా కొత్త అనుభూతిని పొందుతారని, సినిమా ముగిసిన తర్వాత చిత్ర బృందాన్ని అభినందిస్తారనే పూర్తి నమ్మకం తనకు ఉందని పేర్కొన్నారు. అంతేకాకుండా, 'టాక్సిక్' ఒక కల్పిత కథ ఆధారంగా రూపొందిన సినిమా అని, ముఖ్యంగా పెద్దల కోసం రూపొందించిన ప్రత్యేక కథనమని ఆయన స్పష్టం చేశారు. సినిమా టైటిల్‌కు తగ్గట్టుగానే ఇందులో భావోద్వేగాలు, యాక్షన్, రొమాన్స్ ప్రేక్షకులను ఆకట్టుకునే అంశాలు ఉంటాయని సంకేతాలు ఇచ్చారు. ఇటీవల విడుదలైన 'మనసాగదే' పాటకు అద్భుతమైన స్పందన లభిస్తోంది. యశ్, తారా సుతారియా మధ్య సాగే ఈ రొమాంటిక్ ట్రాక్ సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో నిలిచింది. ముఖ్యంగా పాటలోని విజువల్స్,

సంగీతం, ఇద్దరి కెమిస్ట్రీ ప్రేక్షకులను ఆకట్టుకుంటు న్నాయి. ఈ పాటపై హీరోయిన్ తారా సుతారియా కూడా స్పందించారు.